# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా.. అమరావతిలో 58 అడుగుల భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు.
- ❖ 2028 అక్టోబర్ నాటికి అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు ఈరోజు ప్రారంభమయ్యాయి.
- ❖ సంప్రదాయ పంటలతో పాటు లాభాదాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

====================

తెలుగువారి ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసేందుకు ప్రాణాలను సైతం అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా.. రాజధాని అమరావతిలో 58 అడుగుల భారీ విగ్రహాన్ని కూటమి ప్రభుత్వం ఈ రోజు ఆవిష్కరించింది. పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల అలుపెరుగని దీక్షకు గుర్తుగా.. ఈ విగ్రహానికి `స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్` అని నామకరణం చేశారు. తుళ్లూరు సమీపంలోని శాఖమూరు పార్కు వద్ద ఏర్పాటు చేసిన 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ... అహింసా మార్గంలో ఆయన ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో పొట్టి శ్రీరాములు పని చేశారని, అలాగే అనేక సామాజిక ఉద్యమాల్లో ఆయన భాగస్వాములయ్యారని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

====================

2028 అక్టోబర్ నాటికి అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు. ఈ రోజు రాజధాని అమరావతిలో హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో టవర్-1కు మొదటి స్టీల్ డయాగ్రిడ్‌ను అమర్చే పనులను మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... రైతులకు ఇచ్చిన మాట ప్రకారమే రాజధాని అమరావతిని నిర్మిస్తామని చెప్పారు. అమరావతిలో జీఏడీ, హెచ్ఓడీలకు మొత్తం 5 టవర్లు డయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మిస్తున్నామని తెలిపారు. జీఏడీ టవర్ మొత్తం 47 అంతస్తులతో మిగిలిన టవర్లు 40 అంతస్తులతో నిర్మిస్తున్నట్లు మంత్రి నారాయణ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి కార్గో హ్యాండ్లింగ్ ఆపరేషన్ల ద్వారా ఈస్ట్ -వెస్ట్ కార్గో కారిడార్‌గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై ముఖ్యమంత్రి అధికారులతో ఈ రోజు నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో నూతనంగా నిర్మితం అవుతున్న మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల్లో త్వరితగతిన కార్గో హ్యాండ్లింగ్ ఆపరేషన్లు ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీ కూడా ఏర్పాటైన అనంతరం కంటైనర్, బల్క్ కార్గో పోర్టుగా రామాయపట్నం మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

====================

వేసవి తీవ్రత అంచనాలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్రంలో క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల ఆధారంగా రూపొందించిన `సమ్మర్ యాక్షన్ ప్లాన్-2026`పై ఉన్నతాధికారులతో మంత్రి చర్చించారు. వేసవి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయడం, వడ దెబ్బకు గురైతే సదరు వ్యక్తి లక్షణాలను త్వరితగతిన గుర్తించి సకాలంలో వైద్యులను సంప్రదించేలా అవగాహన కల్పించాలని చెప్పారు. చికిత్స అందించేందుకు వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి వర్చువల్ విధానంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు.

విరామం

====================

రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. నేటి నుంచి ఏప్రిల్ 1 వరకు 10వ తరగతి పరీక్షలు జరుగుతాయి. బాపట్ల జిల్లాలో 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ చెప్పారు. ఈ క్రమంలో బాపట్లలోని అన్నవరపు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. పరీక్షలలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు

====================

సంప్రదాయ పంటలతో పాటు లాభదాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామంలో ఈ రోజు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన `రైతన్న మీకోసం` కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో సుమారు 46.83 లక్షల మందికి అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశామని తెలిపారు.

====================

జల్ జీవన్ మిషన్ 2.0 ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఇరవై సూత్రాల కార్యక్రమాల చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. అమరావతిలో ఈ రోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రజలకు దీర్ఘకాలిక తాగునీటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మొత్తం 8.69 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 2028 డిసెంబర్ నాటికి ప్రతి గ్రామీణ కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు.

====================

కర్నూలు జిల్లాలో తగినంత ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల నిల్వ ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా సంయుక్త కలెక్టర్ నూరుల్ ఖమర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గ్యాస్ నిల్వలు సరిపడేంతగా సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 11 వేల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు నిల్వలో ఉన్నాయని, అదనంగా ఈరోజు సుమారు 7 వేల సిలిండర్లు జిల్లాకు చేరుకున్నాయని తెలిపారు. ప్రతిరోజు సగటున సుమారు 10 వేల సిలిండర్లు వినియోగదారులకు పంపిణీ జరుగుతోందని, ప్రస్తుతం ఉన్న డిమాండ్‌కు సరిపడేంత సరఫరా కొనసాగుతోందని చెప్పారు. అవకతవకలు జరిగిన పక్షంలో వినియోగదారులు 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సంయుక్త కలెక్టర్ తెలిపారు.

====================

ఉత్తర తీరప్రాంత తమిళనాడుపై సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని, దీని ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర, యానాంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

====================

వరల్డ్ హైపర్‌టెన్షన్ డే-2025 పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాల నిర్వహణలో అనుసరించిన ఉత్తమ విధానాలకు జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ కు తొలి ర్యాంకు లభించిందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు తెలియజేశారు.

====================

ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా ప్రజలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన "వాట్సాప్ గవర్నెన్స్" స్టాండింగ్ బోర్డులను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి ఈరోజు ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి నుంచే తమ మొబైల్ ద్వారా ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

====================
====================